క్లుప్తంగా

భూసార పరీక్షలతో లాభాలు

నందికొట్కూరు రూరల్ : రైతులు తమ వ్యవసాయ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవడంతో అనేక లాభాలు ఉన్నాయని వీపీఏ శాంతిరాజు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం ద్వారా మట్టిలో ఏఏ పోషకాలు ఉన్నాయో తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులను ఉపయోగించి పంటలను వేసుకోవచ్చని చెప్పారు.

పొలం సర్వే చేయించాలని వినతి

పాములపాడు: నా పొలం సర్వే చేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ మండలంలోని లింగాల గ్రామానికి చెందిన శ్రీరాములు అనే రైతు తహసీల్దార్ రత్నరాధికకు అర్జీ ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో రైతు మాట్లాడుతూ సర్వే నెంబరు 972లో 2.50 ఎకరాలు, 318లో 2.50 ఎకరాల విస్తీర్ణంలో వారసత్వంగా పొలం సంక్రమించిందన్నారు. తన తండ్రి వెకటరంగయ్య పేరిట గతంలో ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, అయితే ఆ పట్టా 2009 వరదల సమయంలో పోయిందన్నారు. తన అన్న నారాయణ పేరిట ఆన్‌లైన్‌లో భూమి నమోదైందని, తన పేరిట కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరాడు. కాగా అటవీభూమిగా రికార్డుల్లో ఉందని తహసీల్దార్ తెలిపారు. అలాగే మరో 4 అర్జీలు ఆన్‌లైన్‌కోసం వచ్చాయని ఆమె తెలిపారు. అలాగే యర్రగూడూరు గ్రామానికి సంబంధించి ఇంటి స్థలం సర్వే కోసం అర్జీ వచ్చిందని ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు.

వలంటీర్లకు సన్మానం



సేవారత్న పురస్కారం గ్రహీత మహబూబ్ బాషాను సత్కరిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ప్రభుత్వం నుంచి ఉత్తమ వలంటీర్లుగా అవార్డులు పొందిన వారు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, సర్పంచ్ బాలస్వామి అన్నారు. సోమవారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో జూపాడుబంగ్లా 1, 2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సర్పంచ్ బాలస్వామి అధ్వర్యంలో సన్మానసభ నిర్వహించారు. జూపాడుబంగ్లాలో 26 మంది వలంటీర్లకు గాను మహబూబ్‌బాషాకు సేవారత్న, 25మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు లభించినట్లు తెలిపారు.

మాన్యం భూముల వేలంతో రూ.2లక్షల ఆదాయం

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయంలో సోమవారం నిర్వహించిన దేవదాయ భూముల కౌలుకు నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.2లక్షలు ఆదాయం చేకూరినట్లు గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణ అధికారి వెంకటరమణ తెలిపారు. పాములపాడులోని శ్రీ కేశవ అంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన 30.66 ఎకరాలు, శ్రీచౌడేశ్వరీ దేవతా దేవస్థానమునకు చెందిన 19.08 ఎకరాలు, శ్రీనాగలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన 12.97 ఎకరాల భూములకు నిర్వహించిన వేలంలో రూ.4.86 లక్షలకు రైతులు కౌలుకు హక్కును దక్కించుకున్నారు.

మహానందిలో భక్తుల సందడి



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: మహానంది ఆలయం సోమవారం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: గ్రామాలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సోమవారం తెలిపారు. ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు ఆయా గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నందికుంట, ఎర్రమఠం 23న, కొత్తపల్లి, ముసలిమడుగు 24న, గువ్వలకుంట్ల, గుమ్మడాపురం 25న, దుద్యాల, శివపురం 30న, కొక్కెరంచ, ఎదురుపాడు, గోకవరం గ్రామాలలో 31వ తేదీ మొబైల్ ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీశైలంలో భక్తులకు ఇంధన కష్టాలు

- పెట్రోల్ బంకుల్లో సిబ్బంది కొరత
- నిరుపయోగంగా రెండు పెట్రోల్ పంపులు
- పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారుల అవస్థలు
- గంటల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితి



ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో నిరుపయోగంగా ఉన్న పెట్రోల్ పంప్.



పెట్రోల్ గన్‌పైప్ ఒక్కటే ఉండడంతో పెట్రోల్ కోసం నిరీక్షిస్తున్న వాహనదారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లన్న దర్శనార్థం వచ్చిన భక్తులు తమ వాహనాల్లో డీజిల్, పెట్రోల్ నింపుకునేందుకు అవస్థలు పడుతున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో రెండు పెట్రోల్‌బంకులు ఉన్నప్పటికీ వాటిలో రెండు పంపులు నిరుపయోగంగా ఉండటంతో ఇంధనం కోసం గంటల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

దేవస్థానం ఆధ్వర్యంలో రెండు పెట్రోలు బంకుల ఏర్పాటు

శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం అనునిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. కొంత మంది భక్తులు ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల్లో తరలిరాగా మరి కొందరు అద్దె, సొంత వాహనాల్లో శ్రీగిరి చేరుకుంటారు. మల్లన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో తమ వాహనాలకు పెట్రోల్, డీజిల్ నింపుకునేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఇండియన్ పెట్రోల్ బంక్, భారత్ పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసింది. ఆయా పెట్రోల్ బంకుల్లో మూడు అండర్ గ్రౌండ్ ట్యాంకులను ఏర్పాటు చేసి రెండింటిలో డీజిల్, ఒక దాంట్లో పెట్రోల్ నింపుతుంటారు. వాహనాలకు డీజిల్, పెట్రోల్ నింపేందుకు 3 పంపులు ఉన్నాయి. ఒక్కో పంపులో డీజిల్, పెట్రోల్ నిపేందుకు రెండు గన్ పంపులు ఉన్నాయి. అయితే రెండు పెట్రోల్ బంకుల్లోనూ మధ్యలో ఉన్న పంపులు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఒక గన్‌పంపు పెట్రోల్‌కు, రెండు డీజిల్‌కు వినియోగిస్తుండగా, మరోక పంపులో డీజిల్‌కు ఒక గన్‌నే వినియోగిస్తున్నారు. మరోకటి నిరుపయోగంగా ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న రెండు పెట్రోల్ బంకుల్లో ప్రస్తుతానికి షిఫ్టుకు ఇద్దరు చొప్పున సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ సిబ్బంది విధులు నిర్వహించడంతో ఉన్నవారు అవస్థలు పడుతున్నారు. షిఫ్టుకు ఒకరు డీజిల్, ఇద్దరు పెట్రోల్‌కు ఉండేలా ముగ్గురు సిబ్బంది ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా స్థానికంగా పెట్రోలు బంకుల్లో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం సమస్యగా మారింది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



శ్రీశైలయాత్రకు విచ్చేసే భక్తులు తమ వాహనాలకు పెట్రోల్, డీజిల్ నింపుకునేందుకు అవస్థలు లేకుండా చర్యలు తీసుకుంటాం. పెట్రోల్ గన్ పంపులను ఎక్కువగా ఏర్పాటు చేస్తాం. పెట్రోల్‌బంక్ నిర్వహణలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. – ఎస్ లవన్న, శ్రీశైలదేవస్థానం ఈఓ

జలజాగరణ దీక్షను విజయవంతం చేయండి



నందికుంటలో సిద్దేశ్వరం జల జాగరణ దీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సంగమేశ్వరం సమీపంలోని సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై అలుగు నిర్మాణం కోసం చేస్తున్న సిద్దేశ్వరం జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలో నందికుంట, శివపురం, పెద్ద గుమ్మడాపురం, ఎర్రమఠం, లింగాపురం, గోకవరం, సింగరాజు పల్లె గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ఈనెల 31న జరుగనున్న సిద్దేశ్వర జల జాగరణ దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో అలుగు నిర్మాణ ఆవశ్యకత, సాగునీటి ప్రాజెక్టుల గురించి అవగాహన కల్పించారు. సిద్దేశ్వరం ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మే 31 సాయంత్రం 6 నుంచి జూన్ 1 ఉదయం 10 గంటల వరకు ఈ దీక్ష జరగుతుందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కర్నూలు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, కొక్కెరంచ విష్ణువర్ధన్ రెడ్డి, నందికుంట నారాయణ రెడ్డి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ వెంకటరమణమ్మ, తులశేశ్వరరెడ్డి, ఎదురుపాడు అయ్యపురెడ్డి, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: రాయలసీమ హక్కులను సాధించుకునేందుకు ఈ నెల 31న చేపట్టనున్న సిద్దేశ్వరం జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రతినిధులు పట్నం రాముడు, భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, అల్వీపురం, పుట్టుపల్లె గ్రామాల్లో సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొంతా సుబ్రహ్మణ్యం, మాజీ ఉప సర్పంచ్ బీవీ రమణ గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఉక్కపోత.. సాయంత్రం ఉరుముల వర్షం



పగిద్యాల వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

- నేలకూలిన నాలుగు విద్యుత్ స్తంభాలు, చెట్లు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

జూపాడుబంగ్లా: సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 3గంటల వరకు తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం 4గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకొని అరగంటల పాటు ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రోడ్ల వెంట వర్షం నీరు పారింది. గాలుల ధాటికి నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు ట్రాన్స్‌కో ఏఈ రామాచారి తెలిపారు. దీంతో సాయంత్రం 7.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొనటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పెను గాలుల బీభత్సం

పగిద్యాల: మండలంలో సోమవారం సాయంత్రం పెనుగాలు సృష్టించిన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని లక్ష్మాపురం, మహాలక్ష్మి పెట్రోల్‌బంకు సమీపాన రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. గ్రామ సర్పంచు పెరుమాళ్ల శేషన్న స్పందించి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను జేసీబీ ద్వారా 2 గంటలు శ్రమించి తొలగించారు. లక్ష్మాపురం, పగిద్యాల ఇతర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వల్ల ఆశాఖ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి ముమ్మర చర్యలు చేపట్టారు. మండలంలో దాదాపు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

సింహగర్జనను విజయవంతం చేయండి

ఆత్మకూరు: రాష్ట్రంలో మాలల హక్కుల కోసం నిర్వహిస్తున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా మాలమహానాడు ప్రధాన కార్యదర్శి అంకన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వెనుకబడిన మాలల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. కర్నూలు జిల్లా ఆలూరులో ఈ నెల 31న సింహగర్జన నిర్వహిస్తున్నామని, దీనికి మాలలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శివన్న, వివిధ మండలాల ఇన్‌చార్జులు సురేష్, బాలయేసు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

మిడుతూరు: ప్రతి కౌలుదారుడు తప్పనిసరిగా కౌలు పత్రం పొందాలని మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసాకేంద్రంలో రైతులకు కౌలు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు కార్డుల ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే వారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. పచ్చి రొట్ట విత్తనాలు, జీలుగ, పిల్లిపెసర, జనుము కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు అశోక్, చంద్రకళ పాల్గొన్నారు.

కొత్తపల్లి ఏపీఓగా రేష్మా

కొత్తపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నూతన ఏపీఓగా షేక్ రేష్మా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె బనగానపల్లె మండలం ఏస్ఆర్ఈజీఎస్‌లో ఏపీఓగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడికి వచ్చారు.

ఆత్మకూరు మార్కెట్ కమిటీలో నలుగురికి చోటు

మహానంది: బండిఆత్మకూరు మండలానికి చెందిన నలుగురికి ఆత్మకూరు మార్కెట్ యార్డు కమిటీలో నలుగురికి చోటు లభించింది. పరమటూరుకు చెందిన రేగటి బలరామిరెడ్డి, బండిఆత్మకూరుకు చెందిన శిరోమణెమ్మ, నారాయణాపురం నుంచి ఎస్.పద్మావతమ్మ, పెద్ద దేవళాపురం నుంచి విక్రమ్ సింహానాయక్‌లకు స్థానం కల్పించారు. ఈ మేరకు వారు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు సొసైటీలకు రూ.2.85కోట్ల రుణాలు మంజూరు

మహానంది: గోపవరం, తిమ్మాపురం సొసైటీలకు రూ. 2.85 కోట్లు మంజూరైనట్లు సొసైటీల చైర్మన్ గాజులపల్లె కిట్టు, వగడాల నాగరాజు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గోపవరం సొసైటీకి రూ.1.40 కోట్లు, తిమ్మాపురం సొసైటీకి రూ. 1.48కోట్ల మేరకు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రభాకర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టూటౌన్ పోలీస్టేషన్ పరిధిలో పట్టుబడి సరైన పత్రాలు, యజమానుల ఆచూకీ తెలియని వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3వేలు డిపాజిట్‌ను టూటౌన్ స్టేషన్‌లో చెల్లించి రసీదు పొందాలని, రసీదు ఉన్న వారినే వేలం పాటకు అనుమతిస్తామని చెప్పారు.

విద్యార్థులకు గ్లాసులు మంజూరు



హెచ్ఎంలకు గ్లాసులకు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఈఓ

నంద్యాల(న్యూటౌన్): జగనన్న గోరుముద్ద పథకానికి జిల్లాలోని 1,365 పాఠశాలలకు 1,52,526 స్టీల్ గ్లాసులు మంజూరయ్యాయని డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్ తెలిపారు. సోమవారం స్థానిక విశ్వనగర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేశారు. నంద్యాల మండలానికి 16,631 గ్లాసులు మంజూరు కావడంతో పంపిణీ చేశామని ఆయన చెప్పారు. గ్లాసులపై జగనన్న గోరుముద్ద అనే పేరు కూడా ముద్రించారన్నారు. నంద్యాలలోని 28 మండలాల ఎంఈఓలకు గ్లాసులను అందించామని, వీటిని హెచ్ఎంలకు అందజేస్తారని తెలిపారు. ఎండీఎం ఇక్బాల్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, ప్రధానోపాధ్యాయులు ప్రమీల, మోహన్‌రెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్ద పీట



మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలస్వామియాదవ్

ఆత్మకూరు: రైతుల సంక్షేమానికి పెద్ద పీటవేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు, నూతన మార్కెట్‌యార్డ్ చైర్మన్‌బాల స్వామియాదవ్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం నూతన మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, పంటలకు గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్‌యార్డుల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



పల్లకీలో కొలువైన స్వామివార్లకు హారతిపూజలు

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని చేపట్టారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



పగిద్యాలలో సేవారత్న అవార్డు గ్రహీత రాజేశ్వరిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య



మిడుతూరు వలంటీర్ అజ్మద్దీన్‌కు సేవ వజ్ర పురస్కారం అందజేస్తున్న దృశ్యం



అవార్డు అందుకున్న మిడుతూరు-1, 2 సచివాలయాల వలంటీర్లు

మిడుతూరు: వలంటీర్లు సంక్షేమ సారథులుగా ఉంటూ ప్రతి కుటుంబానికి సేవలందిస్తున్నారని నందికొట్కూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ అధ్యర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. మండలంలోని మిడుతూరు -2 సచివాలయ వలంటీర్ ఎస్.అజ్మద్దీన్, పీపనగండ్ల వలంటీర్ బరిగల అనూషకు సేవా వజ్ర పురస్కారం, మిడుతూరు-1 గ్రామ సచివాలయం నుంచి సామక్క , కడుమూరు సచివాలయం నుంచి రమాదేవి, నాగలూటి సచివాలయం నుంచి వరలక్ష్మి, తలముడిపి సచివాలయం నుంచి ఈశ్వరమ్మ, తిమ్మాపురం సచివాలయం నుంచి విజయుడులకు సేవారత్న పురస్కారాలు వచ్చినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. అనంతరం మిడుతూరు-1, 2 సచివాలయాలకు సంబంధించిన గ్రామ వలంటీర్లను దుశ్శాలువ, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవమ్మ, కార్యలయ ఏఓ దశరథరామయ్య, పంచాయతీ కార్యదర్శులు సుధీర్, వినోద్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

పగిద్యాల: ప్రజలకు గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య అన్నారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయాలంలో సర్పంచు శేషన్న అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓపీఆర్డీ పుల్లయ్య, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ ప్రారంభం

నంద్యాల టౌన్ : నంద్యాల జిల్లాలో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రథమ చికిత్సపై డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఆర్. వెంకటరమణ అధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం సోమ వారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స చేయడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పాము కాటు, గాయాలకు కట్టుకట్టడం, కుట్లు వేయటం, తదితర చికిత్సలపై శిక్షణ ఇస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ రేఖ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ

భక్తిశ్రద్ధలతో గంగమ్మవ్వ ఆరాధన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కల్పనా సెంటర్‌లో వెలసిన కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో కాశినాయన ప్రథమ శిష్యురాలైన ఆకుల గంగమ్మవ్వ 8వ ఆరాధన వేడుకలను నిర్వాహకులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే గంగమ్మవ్వ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలంగి సేవ జరిపించారు. సామూహిక కుంకుమార్చన అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి, భక్తులకు యథావిధిగా అన్నదానం చేశారు. డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'స్పందన'తో సమస్యల పరిష్కారం

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు స్పందన కార్యక్రమం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని అధికారులు తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రతి రోజూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో ప్రతి సమస్యకు పరిష్కారం

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రతి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ద్వారా పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలం ఆన్‌లైన్, భూమి తగాదాలు, ఇతర సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరం చూపుతున్నారన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పీఓఎల్ఆర్ డీటీ పెద్దన్న, డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో



తీవ్రంగా గాయపడిన మద్దమ్మ

జూపాడుబంగ్లా: వేగంగా వస్తున్న ఆటోకు అడ్డంగా కుక్కరావడంతో దాన్ని తప్పించబోగా అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన సోమవారం తంగడంచ దర్గా సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లాకు 10మంది ప్రయాణికులతో ఆటో బయలుదేరింది. మార్గమధ్యలో తంగడంచ దర్గా వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన కుక్కను డ్రైవర్ రాజు తప్పించబోగా అదుపుతప్పిన ఆటో రోడ్డుపక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తంగడంచ గ్రామానికి చెందిన మద్దమ్మ చెయ్యి విరిగింది. తపితమ్మ, ఘణపురం వీఆర్ఏ సామేలు, నవీన్, డ్రైవర్ రవి తలలకు దెబ్బలు తగిలి తీవ్రరక్తస్రావం కావటంతో వారిని ఆటోల్లో నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. సాయిపవన్, వెంకటేశ్ అనే చిన్నారులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసి సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నాగేంద్రప్ప కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితరుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సాయంత్రం దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శంకర్‌రెడ్డి, గిరి, శ్రీనివాసరావు, తాలూకా అధ్యక్షుడు బాలకృష్ణయ్య, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు వందనం

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు వలంటీర్లకు వందనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విజయవంతం చేయాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం పడమటూరు రస్తా వద్ద ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నారాయణపురం గ్రామానికి చంద్ర ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానికులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు.